సాక్షి
హనుమకొండ

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



చేతి యంత్రాలతో విత్తనాలు విత్తుకోవచ్చు

చేతి యంత్రాలతో విత్తనాలు విత్తుకోవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న తెలిపారు. - 8లో▸



ఉద్యోగులందరూ సమానమే

కేయూలో ఉద్యోగులందరూ తనకు సమానమేనని, ఎవరైనా నేరుగా తనను కలిసి సమస్యలు విన్నవించుకోవచ్చునని వీసీ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30⁰/18⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రుద్రేశ్వరుడికి లక్ష బిల్వార్చన



హన్మకొండ కల్చరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల ఆలయంలో గురువారం రుద్రేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ ఉదయం ప్రభాతసేవ, మూలగణపతికి అభిషేకం, పూజలు, శ్రీరుద్రేశ్వరుడికి సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. చిట్టిరెడ్డి రాంరెడ్డి దంపతుల సౌజన్యంతో మహాలక్ష్మి ఉద్భవించిన మారేడుచెట్టు దళాలతో లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు రుద్రకవచ స్తోత్ర మూలమంత్రయుక్తంగా శివుడికి అర్పించారు. అనంతరం దేవాలయ ఆవరణలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం ప్రదోష కాలపూజలు జరిగాయి. మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.

ఎంఏ తెలుగులో స్పాట్ అడ్మిషన్లు

హన్మకొండ కల్చరల్: వరంగల్ హంటర్‌రోడ్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద విజ్ఞాన పీఠం వరంగల్ ప్రాంగణంలో ఈనెల 20వ తేదీ వరకు ఎంఏ రెగ్యులర్ తెలుగు కోర్సులో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జానపద విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకుని హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 90309 99640 సెల్ నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రపంచ డయాబెటిస్ నివారణ దినోత్సవం సందర్భంగా డయాబెటిస్ స్క్రీనింగ్ పరీక్షల తీరును పరిశీలించారు. అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న షుగర్ పేషెంట్లకు ఉచితంగా అందిస్తున్న మందుల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ స్టోర్‌లో మందుల లభ్యత, రికార్డులను పరిశీలించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

వరంగల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని వరంగల్ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు అన్నారు. దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మోహన్‌సింగ్, వైద్యాధికారి టి.భరత్‌కుమార్, సూపర్‌వైజర్ జన్ను కోర్నేల్, ఫార్మసిస్ట్ అనిల్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రజియా, అకౌంటెంట్ స్వర్ణలత, కుమారస్వామి, బుచ్చయ్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన అధికారులు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయాన్ని గురువారం మాజీ చీఫ్ సెక్రటరీ, రాష్ట్ర ఎలక్షన్ మాజీ కమిషనర్ రమాకాంత్‌రెడ్డి, సీనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ అడిషనల్ పీసీసీఎఫ్ సునీత భగవత్ కుటుంబసమేతంగా సందర్శించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించి మహదాశీర్వచనం అందజేశారు.

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడానికి ఆసక్తి గల మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధులు, జైనులు, పార్సీలు) యువతకు టోఫెల్, జీఆర్‌ఈ, ఐఈఎల్‌టీఎస్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల మైనారిటీ సంక్షేమాధికారులు రమేశ్, మురళీధర్‌రెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వివరాలకు వరంగల్ జిల్లా వాళ్లు సుబేదారిలోని హనుమకొండ షరీఫన్ మజీద్ ఎదుట ఉన్న కార్యాలయం, 040-23236112 నంబర్‌లో, హనుమకొండ జిల్లా వాళ్లు సుబేదారిలోని కలెక్టరేట్‌లో సంప్రదించాలని సూచించారు.



ఆర్డీఓ ఉమారాణికి కేక్ తినిపిస్తున్న బాలిక



పిల్లల మధ్యలో కూర్చొని షేక్ హ్యాండ్ ఇస్తూ కబుర్లు చెబుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్

మీ ఎదుగుదలకు అండగా ఉంటాం

- నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి
- పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం

సాక్షి మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్‌హోంలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీఓ ఉమారాణి హాజరై చిన్నారులతో ముచ్చటించారు. డ్రాయింగ్‌తోపాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు లేని పిల్లలు ఎంతో ఆందోళనకు గురవుతారు.. వారి భవిష్యత్ ఎదుగుదలకు అండగా ఉంటామని ఆర్డీఓ ఉమారాణి భరోసా ఇచ్చారు. - నర్సంపేట

షేక్‌హ్యాండ్ ఇచ్చి... కేక్ తినిపించి..

- పిల్లల పోషణకు సహకారం : ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని దైవకృప చైల్డ్‌హోంలో గురువారం బాలల దినోత్సవ కార్యక్రమం జరిగింది. మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.. పిల్లలతో కలిసిపోయి సరదాగా కబుర్లు చెప్పారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆప్యాయంగా పలకరించారు. కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. పిల్లల పోషణ, వారి అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. - మహబూబాబాద్

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేట, మహబూబాబాద్‌లోని చైల్డ్‌హోంలలో బాలల దినోత్సవం

- పూర్తి వివరాలు 8లో▸

ఇంట్లోనే చేపల పెంపకం

ఉప్పలపల్లిలో ఏడేళ్లుగా బయోఫ్లాక్ సిస్టంతో చేపల పెంపకం

- అరగుంటలోనే 4 వేల చేపల పెంపకం
- ఆహారంగా ఆర్గానిక్ ఫుడ్.. వృథా నీటితో కూరగాయల సాగు



కవర్లతో ఏర్పాటు చేసిన డ్రమ్ములు



బయోఫ్లాక్ సిస్టంలో పెరుగుతున్న చేపలు

కమలాపూర్: సాధారణంగా చేపలు చెరువులు, కుంటల్లో పెరుగుతాయి. కొందరు తమకున్న వ్యవసాయ భూముల్లో ఎకరం, రెండెకరాల్లో గుంతలు తవ్వి, మడులు ఏర్పాటు చేసుకుని వాటిల్లో చేపలు పెంచుతుంటారు. కానీ ఇతను మాత్రం ఏడేళ్లుగా బయోఫ్లాక్ (తక్కువ స్థలంలో ఎక్కువ ఉత్పత్తి) సిస్టంతో ఇంట్లోనే.. అదీ కేవలం అరగుంట స్థలంలో నిర్మించుకున్న నాలుగు గదుల ఇంట్లో చేపల పెంపకం చేపట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల చొప్పున సంపాదిస్తున్నాడు. అంతేకాదు చేపల పెంపకానికి వినియోగించే నీటిని ఏ రోజుకు ఆ రోజు మారుస్తూ ఆ నీటితో కూరగాయలు సాగు కూడా చేస్తున్నాడు. దీంతో అతడికి నెలకు రూ.5 వేలకు పైనే అదనపు ఆదాయం వస్తోంది. అతడే కమలాపూర్ మండలం ఉప్పలపల్లికి చెందిన గాజుల తిరుపతి.

ఎకరాల కొద్ది భూమి అవసరం లేదు..

చేపల పెంపకానికి ఎకరాల కొద్ది భూమి అవసరం లేదు. కేవలం అరగుంట భూమి ఉన్నా బయోఫ్లాక్ సిస్టంలో చేపల పెంపకం చేపట్టి ఎకరం భూమిలో పెంచే అన్ని చేపలను పెంచవచ్చు. అందుకు తిరుపతి ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అరగుంట భూమి ఉన్నా, లేదంటే అరగుంట స్థలంలో ఇంట్లోనైనా, ఆరుబయటనైనా బయోఫ్లాక్ సిస్టంలో చేపలు పెంచవచ్చంటున్నాడు.

నాలుగు డ్రమ్ములు.. రూ.2.50 లక్షల పెట్టుబడి..

అరగుంట స్థలంలో, లేదంటే అంతే స్థలమున్న ఇంట్లో 9 వేల లీటర్ల (త్రీ డయా) కెపాసిటీ కలిగిన నాలుగు కవర్లతో కూడిన డ్రమ్ములు ఏర్పాటు చేసుకుంటే మొదటగా రూ.2.50 లక్షలు ఖర్చవుతుంది. ఆ తర్వాత 4 వేల చేప పిల్లలు, వాటి పెంపకానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. ఏడాది కాలంలో చేప పిల్లలు కిలో సైజు వరకు పెరుగుతాయి. అవి పెరిగాక మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ధరను బట్టి విక్రయిస్తే మొత్తానికి రూ.1.60 లక్షల నుంచి రూ.2లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. మొదటి ఏడాది పెట్టుబడి కింద పోయినా మరుసటి ఏడాదినుంచి రూ.లక్షకుపైనే ఆదాయం వస్తుంది.



వృథా నీటితో సాగు చేస్తున్న కూరగాయలు

వృథా నీటితో కూరగాయల సాగు..

బయోఫ్లాక్ సిస్టం చేపల పెంపకంలో ప్రతీరోజు నీటిని మార్చాల్సి ఉంటుంది. నీటిని మార్చే క్రమంలో ఆ నీరంతా వృథా అవుతుంది. కానీ తిరుపతి ఆ నీటిని వృథా పోనివ్వకుండా కూరగాయల సాగు చేపట్టాడు. అసలే ఆర్గానిక్ ఫుడ్ కలిసి ఉండి, అందులోనూ చేపల పెంపకానికి వినియోగించిన నీరు కావడంతో ఆ నీటిలో అత్యధిక పోషకాలుంటున్నాయి. ఈ కూరగాయలతోనూ నెలకు రూ.5 వేలకు పైగా ఆదాయం పొందుతున్నాడు.

చేపలకు ఆహారంగా ఆర్గానిక్ ఫుడ్..

సాధారణంగా చేపలు చెరువులు, కుంటల్లోని నాచును ఆహారంగా తీసుకుంటాయి. కానీ బయోఫ్లాక్ సిస్టంలో నాచు దొరకదు కాబట్టి చేపల పెంపకానికి 42 శాతం ప్రొటీన్లు కలిగి ఉన్న ఆర్గానిక్ ఫుడ్‌ను తిరుపతి వినియోగిస్తున్నాడు. దీంతో ఆ చేపలు సాధారణం కన్నా కొంత బలిష్టంగా పెరిగి 12 నుంచి 15 నెలల కాలంలో ఒక్కో చేప కేజీ నుంచి కేజీన్నర వరకు పెరుగుతాయి.

ఆసక్తి ఉన్న వారికి సలహాలిస్తా..



చేపల పెంపకం కోసం నేను మీరట్‌లో శిక్షణ తీసుకున్నా. బయోఫ్లాక్ సిస్టంలో చేపల పెంపకం చేపట్టాలనుకునే ఆసక్తి ఉన్న వారికి అవసరమైన సలహాలు, సూచనలందిస్తా. పొట్ట కూటి కోసం ఏదో ఒక పని చేసుకోవాలన్న ఆలోచనతో బయోఫ్లాక్ సిస్టంలో చేపల పెంపకం చేపట్టా. నెలకు రూ.10 నుంచి 15 వేల వరకు సంపాదిస్తున్నా.

- గాజుల తిరుపతి

వైఎస్సార్ చొరవతో ఇంటర్నెట్ సేవలు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: దివంగత నేత వైఎస్సార్ చొరవతో రూ.5 కే గ్రంథాలయాలకు ఇంటర్నెట్ సేవలు అందించామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైఎస్సార్ హయాంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించానని గుర్తు చేశారు. లైబ్రరీలో చదువుకుని ఉన్నత స్థాయిలో ఉన్న అభ్యర్థులు గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రంథాలయ సిబ్బంది వేతనాల్లో జాప్యం లేకుండా సమస్యల్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి శైలజాదేవి, లైబ్రేరియన్లు మల్సూర్, పురుషోత్తంరాజు, సామాజికవేత్తలు నిమ్మల శ్రీనివాస్, సాగంటి మంజుల, జూనియర్ అసిస్టెంట్ సంతోశ్ పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా బ్రిడ్జి పనులు పూర్తి

కాజీపేట: కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్ని మార్చి నెలాఖరులోగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. కాజీపేటలో రూ.78 కోట్ల వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చిన మెటీరియల్‌ను గురువారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, నాయకులు ఈవీ శ్రీనివాస్ రావు, అబుబక్కర్ పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు



ఆసియాకు జ్ఞాపిక అందజేసి అభినందిస్తున్న ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు

న్యూశాయంపేట: విద్యను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రమేశ్‌బాబు అన్నారు. గురువారం హనుమకొండ హంటర్‌రోడ్, హనుమకొండ-1, మైనార్టీ (బాలికలు) గురుకులంలో ప్రిన్సిపాల్ ఎం.నీరజ అధ్యక్షతన బాలల దినోత్సవం సందర్భంగా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో బాలల హక్కులపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలకార్మికులను ఎవరూ ప్రోత్సహించవద్దన్నారు. ఈసందర్భంగా గురుకులంలో ఇంటర్ చదువుతూ.. కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థి ఆసియాకు జ్ఞాపిక అందించి అభినందించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. బాలికలు లైంగిక వేధింపులు, ఇతర సమస్యలను తెలిపేందుకు గురుకులంలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు జడ్జి రమేశ్‌బాబు తెలిపారు. బాలికలు కంప్యూటర్ విద్యను అందిపుచ్చుకునేందుకు 10 కంప్యూటర్లు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, పీపీ శ్రీకాంత్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు సీపీఆర్

- ప్రాణం పోసిన 108 సిబ్బంది



బాలుడికి సీపీఆర్ చేస్తున్న 108 సిబ్బంది

వేలేరు: నెలలు నిండకుండా.. గుండె చప్పుడు లేకుండా అప్పుడే పుట్టిన మగబిడ్డకు సీపీఆర్ చేసి 108 సిబ్బంది ప్రాణాలు కాపాడారు. మండలంలోని లోక్యాతండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్యా అఖిలకు నెలలు నిండకుండానే పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇవ్వగా.. ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన మగబిడ్డ బరువు తక్కువగా ఉండి, శ్వాస, గుండె చప్పుడు ఎలాంటి చలనం లేకపోవడంతో డాక్టర్ మనీశ్ సూచనల మేరకు 108 పైలెట్ కృష్ణంరాజు, టెక్నీషియన్ కృష్ణంరాజు బాబుకు సీపీఆర్ చేశారు. ఆక్సిజన్ అందిస్తూ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సకాలంలో సీపీఆర్ చేయడంతో శిశువుకు ప్రాణాపాయం తప్పింది. సీపీఆర్ చేసిన 108 సిబ్బందికి అఖిల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షలో కలెక్టర్, ఇతర అధికారులు

హన్మకొండ అర్బన్: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లాలో ఎవరైనా అలా పరీక్షలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే నమోదైన కేసులు పరిష్కారం వేగవంతం చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై నిఘా, ఆకస్మిక దాడులు చేసి చట్ట వ్యతిరేక చర్యలు ఆపాలని సూచించారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నంబర్ 181కు కాల్ చేయాలని నంబర్‌కు ప్రచారం కల్పించాలని సూచించారు. ఆబార్షన్లకు సంబంధించి సమాచారం రహస్యంగా ఇచ్చేందుకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేయాలని, ఒక మెయిల్ ఐడీ అందుబాటులోకి తేవాలని కలెక్టర్ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేరు ఇతర వివరాలు రహస్యంగా ఉంచుతామని నమ్మకం కల్పించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి లైసెన్సులు తాత్కాలికంగా రద్దు చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, డీడబ్ల్యూఓ జయంతి, బన్ను సొసైటీ ప్రతినిధి ఈవీ శ్రీనివాస్‌రావు, ఇతర అధికారులు ఉన్నారు.

ఓటు చైతన్యం కోసం ముగ్గుల పోటీలు

ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో గురుకుల పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. ఈసందర్భంగా ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. జెడ్పీ సీఈఓ విద్యాలత, ఆర్డీఓ రాథోడ్ రమేశ్, డాక్టర్ కన్నం నారాయణ, డీటీలు విశలేశ్వర్, శ్యాంకుమార్, ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

వృద్ధుల కేసులు సత్వరమే పరిష్కరించాలి

వయో వృద్ధులకు సంబంధించి కేసులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు గురువారం కలెక్టరేట్‌లో వయోవృద్ధుల సంరక్షణ, పోషణ్ చట్టం పరిధిలో వచ్చిన కేసుల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేశారు. ఆసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అదేవిధంగా ట్రిబ్యూనల్‌లో నమోదైన కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులకు, వృద్ధులకు కౌన్సెలింగ్ నిర్వహించి సానుకూల పరిష్కారం చూపాలని సూచించారు. హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, డీడబ్ల్యూఓ జయంతి ఇతర అధికారులు ఉన్నారు.

నేడు కార్తీక పౌర్ణమి

నగరంలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో శుక్రవారం కార్తీకపౌర్ణమి వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుపుతారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు లక్షదీపార్చన, లక్షవత్తుల పూజ ఉంటుందని ఈఓ కె. వెంకటయ్య, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

- హన్మకొండ కల్చరల్



వేయిస్తంభాల ఆలయంలో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సర్వేను పరిశీలించిన జెడ్పీ సీఈఓ



సర్వే తీరును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

వేలేరు: ఇంటింటి సమగ్ర సర్వేకు మండల ప్రజలు సహకరించాలని జిల్లా జెడ్పీ సీఈఓ విద్యాలత కోరారు. గురువారం ఎంపీడీఓ లక్ష్మీప్రసన్నతో కలిసి మండలంలోని మల్లికుదుర్ల, గుండ్లసాగర్, పీచర, వేలేరు గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా సర్వే చేయాలని, గ్రామాల్లోని అన్ని కుటుంబాల వివరాలను విధిగా సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సూపర్‌వైజర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎఫ్ఐ 50 ఏళ్లుగా కొనసాగుతోంది..

వరంగల్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 50 సంవత్సరాలుగా అనేక అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దిందని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ స్పష్టం చేశారు. 'సాక్షి'లో గురువారం 'ఒకే క్రీడ .. రెండు సంఘాల' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ గల హ్యాండ్‌బాల్ క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ అందించిన ఘనత హెచ్ఎఫ్ఐది అన్నారు. కేవలం రెండు సంవత్సరాల క్రితం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాతో కొత్త సంఘం ఏర్పాటైందన్నారు. దీనికి సాయ్, శాట్‌ల నుంచి సహకారం లేదని, హెచ్ఎఫ్ఐకే అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. త్వరలో కోర్టు తీర్పు కూడా హెచ్ఎఫ్ఐకి అనుకూలంగా రానుందని తెలిపారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

కాజీపేట రూరల్: పెద్దపల్లి జిల్లాలో జరిగిన గూడ్స్ రైలు ఘటనతో బుధవారం రద్దు, దారి మళ్లింపు, రీషెడ్యూల్ అయిన రైళ్లు గురువారం నుంచి యథావిధిగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బల్హార్షా–విజయవాడ– సికింద్రాబాద్ రూట్‌లో కాజీపేట మీదుగా ప్రయాణించే రైళ్లన్నీ యథావిధిగా నడుస్తున్నట్లు చెప్పారు. గూడ్స్ ఘటనలో సికింద్రాబాద్– దానాపూర్ ఎక్స్‌ప్రెస్ గురువారం రద్దయిందన్నారు. శుక్రవారం నుంచి యథావిధిగా నడవనున్నట్లు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆర్ఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రయాణికులు 9959226056 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

షేక్‌హ్యాండ్ ఇచ్చి... కేక్ తినిపించి..

చైల్డ్ హోం పిల్లలతో సరదాగా గడిపిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

- పిల్లల అవసరాలు తీర్చేందుకు సహకారమందిస్తా
- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మహబూబాబాద్ చైల్డ్ హోంలో బాలల దినోత్సవం


పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ : 'వారిలో కొందరు అమ్మానాన్నలు లేనివారు.. మరికొందరు విధి వంచితులు ఉన్నారు.. తమ వారు ఎక్కడ ఉన్నారో తెలియదు.. ముక్కుపచ్చలారని వయసులో చైల్డ్‌హోం నిర్వాహకులే అమ్మానాన్నలు, సాటి బాల బాలికలే అన్నాదమ్ముళ్లు.. అక్కా చెల్లెళ్లుగా జీవిస్తున్నారు. వీరితో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సరదాగా గడిపారు.. చిట్టి చేతులకు షేక్ హ్యాండ్ ఇచ్చారు.. మానసిక పరిపక్వత లేని బాలలతో ముచ్చటించారు. పేరు అడిగారు..ఏం చదువుతున్నావో చెప్పమన్నారు.. బాగా చదువుకోవాలి అని చెప్పి ఒప్పించారు. వారి మధ్యలో కూర్చుని కబుర్లు చెప్పారు.. కేక్ కట్‌చేసి సంబురాలు పంచుకున్నారు. కేక్ తినిపించి ఆప్యాయత పంచారు. ఈ ఆనందకర ఘటన గురువారం 'సాక్షి' మీడియా, దైవ కృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో జరిగింది.

కేక్ కట్ చేసి.. పిల్లల మధ్య కూర్చుని కబుర్లు

బాలల దినోత్సవం సందర్భంగా దైవ కృప చైల్డ్‌హోంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల మధ్య కూర్చుని వారితో ముచ్చటించారు. వారిలో ఒక చిన్నారి తన పేరు 'నాని' అని చెప్పడంతో హీరో నాని అంటూ పొగిడారు. అనంతరం పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. వారిలో ఇద్దరు పిల్లలను ఎత్తుకుని వారికి కేక్ తినిపించారు. ఆట, పాటల్లో గెలుపొందిన వారితోపాటు, పిల్లలందరికీ కంపాక్స్‌లు, పరీక్ష ప్యాడ్స్, వాటర్ బాటిల్స్, తదితర బహుమతులు అందజేశారు. పండ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు.


పిల్లలకు గిఫ్టులు ఇస్తున్నఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

పిల్లలు దేవుడిచ్చిన వరం

పిల్లలు దేవుడు ఇచ్చిన వరమని, వారికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించి పనిచేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.. నిర్వాహకులకు సూచించారు. పిల్లల విద్య, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ పెట్టాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగిన వారి చరిత్రలు చెప్పాలన్నారు. సమాజంలోని మంచి పౌరులుగా తీర్చిదిద్దితే వారి భవిష్యత్ బంగారు మయం చేసిన వారవుతారన్నారు. పిల్లల పోషణ, వారి అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. వారిలో అనాథలం, ఎవరూ లేని వారం అనే భావన రాకుండా చూడాలన్నారు. చిన్నప్పటి నుంచే మనోధైర్యం నింపాలని చెప్పారు. పిల్లలు శ్రద్ధగా చదువుకుని ఉన్న స్థాయికి ఎదగాలన్నారు.

వార్తలకే పరిమితం కాకుండా..

మీడియా అంటే హడావుడి.. వార్తలు, కథనాల పేరుతో బీజీగా ఉంటారు.. కానీ'సాక్షి' వార్తలకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మంచి వార్తలు రాసి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు యత్నించాలని చెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా చైల్డ్ హోంలో కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను ఆహ్వానించిన 'సాక్షి' మీడియా, దైవ కృప వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఈకార్యక్రమంలో చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి. వీరన్న, 'సాక్షి' స్టాఫ్ రిపోర్టర్ ఈరగాని భిక్షం, ఆర్‌సీ ఇన్‌చార్జ్ అర్రం రమేశ్ చందర్, అర్బన్ రిపోర్టర్ కిరణ్, 22 మంది పిల్లలు , సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది..



ఆర్ఫన్స్, సెమీ ఆర్ఫన్స్‌తోపాటు, వృద్ధులు, మానసిక దివ్యాంగులకు సేవ చేయాలని లక్ష్యంతో సంస్థను నిర్వహిస్తున్నా. పిల్లల చదువులు, వారికి బలమైన ఆహారం కోసం దాతల సహకారం మరువలేనిది. వారి పోత్సాహంతోనే పిల్లలను పోషిస్తున్నా. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

-బి. లోకేశ్, చిల్డ్రన్స్ హోం నిర్వాహకుడు

సంతోషంగా ఉంటాం



నా చిన్నప్పుడు హోంలో చేరా. ఇప్పుడు తొమ్మిదో తరగతి చదువుతున్నా. హోంలో ఉన్న వారందరం ఒకరికొకరం అన్నట్లు ఉంటాం. పండుగలు, ప్రత్యేక రోజుల్లో హోంకు వచ్చే దాతలు, వారు చూపించే ఆప్యాయత మర్చిపోలేం. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగం సాధిస్తా. నాలాంటి పిల్లలకు సేవ చేస్తా.

సాయి చరణ్, 9వ తరగతి

సార్ చూపించిన ఆప్యాయత మరిచిపోలేం



ఈరోజు మా హోంకు వచ్చిన ఎస్పీ సార్, ఇతర పెద్దలు మాతో ఆప్యాయంగా గడిపారు. గిఫ్టులు ఇచ్చారు. సార్ మా మధ్యలో కూర్చుని అందరి పేర్లు అడిగి తెలుసుకున్నారు. తమ్ముళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. కేక్ తినిపించారు. సార్ చూపించిన ఆప్యాయత మరిచిపోలేం. సార్ చెప్పినట్లు కష్టపడి బాగా చదువుతా..

జగదీశ్, 9వ తరగతి

మీ ఎదుగుదలకు అండగా ఉంటాం

- నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి
- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్‌హోంలో బాలల దినోత్సవం


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ ఉమారాణి

నర్సంపేట: తల్లిదండ్రులు లేని అనాథలు ఎంతో ఆందోళనకు గురవుతారు.. వారి ఎదుగుదలకు అండగా ఉంటాం.. మీరు (అనాథపిల్లలు) క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి అన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్ హోంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ ఉమారాణి.. చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రాయింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

'సాక్షి' కృషి అభినందనీయం..

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ప్రతిభ వెలికి తీసే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆర్డీఓ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ప్రోత్సాహం అందిస్తూ బహుమతులు ఇవ్వడం సంతోషకరమని తెలిపారు.

విద్యార్థులతో మాటామంతీ...

పర్యావరణంతోపాటు చెట్లు, జంతువుల ఆవశ్యకత అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వేసిన డ్రాయింగ్‌ను పరిశీలించారు. పోటీ పరీక్షల్లో ఉత్తమంగా రాణించాల్సిన అవసరం ఉందని సూచనలు చేశారు. విద్యార్థుల జీవన విధానం తెలుసుకున్నారు. విద్యార్థులకు అందే సౌకర్యాలపై ఆరా తీశారు. చైల్డ్ హోం నిర్వాహకులు అందిస్తున్న సేవలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, చైల్డ్ హోం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆర్డీఓ సమయం కేటాయించి ముచ్చటించడం విద్యార్థులకు సంతోషం కలిగింది.

ఉత్తమ ఫలితాలు సాధించాలి..

'విద్యార్థుల్లో ఎలాంటి ఆందోళన ఉండొద్దు.. హోం నిర్వాహకులు అందిస్తున్న సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించాలి.. కష్టాలు ధైర్యంగా ఎదుర్కొని భవిష్యత్‌లో మంచి స్థానంలో నిలవాలి.. కష్టాలు వచ్చాయనే భావన విద్యార్థుల్లో లేకుండా తొలగిపోతాయనే నమ్మకంతో ముందుకు సాగాలి' అని వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి తెలిపారు. సమాజం అంతా మనతో ఉందనే భావనతో లక్ష్యం ఎంచుకుని గమ్యాన్ని చేరుకునే వరకు కష్టపడుతూనే ఉండాలని సూచించారు.

కేక్‌కట్ చేసి స్వీట్లు పంచి..

బాలల దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ ఉమారాణి.. చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పెన్నులతో పాటు మోడల్స్ అందజేశారు. గంటకు పైగా విద్యార్థులతో ముచ్చటించి సంతోషించారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' ఆర్‌సీ ఇన్‌చార్జ్ అబ్బు వెంకట్‌రెడ్డి, ముత్తోజు కిరణ్, గండ్రోతు రమేశ్, చైల్డ్ హోం నిర్వాహకులు డాక్టర్ మోహన్‌రావు, వినోద, తదితరులు పాల్గొన్నారు.

మీడియా పాత్ర గొప్పది ..

అన్ని రంగాల అభివృద్ధి మీడియా పాత్ర గొప్పగా ఉంటుందని, ప్రజల అవసరాలను ప్రభుత్వానికి తెలియజేయడం.. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు తెలియజేయడమే కాకుండా కరోనా, ఎన్నికల లాంటి ప్రత్యేక పరిస్థితుల్లో కూడా మీడియా సేవలు గొప్పవన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియా లేకపోతే సమాజం స్థిరంగా ఉండదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మీడియాపై నమ్మకం మరింత బలపడుతుందన్నారు.


డ్రాయింగ్ వేసిన విద్యార్థినులతో ఆర్డీఓ ఉమారాణి, నిర్వాహకుడు మోహన్‌రావు

ఉద్యోగులందరూ సమానమే

- ఎవరైనా నేరుగా సమస్యలు చెప్పుకోవచ్చు
- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగులందరూ తనకు సమానమేనని, ఎవరైనా నేరుగా తనను కలిసి సమస్యలు విన్నవించుకోవచ్చని, తనపరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని, మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాత్రి కేయూ సెనెట్‌హాల్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కమిటీ వేసి ఆ నివేదికల ఆధారంగానే పదోన్నతుల కల్పనకు ముందుకెళ్తానని స్పష్టం చేశారు. కేయూ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్‌సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ యూనివర్సిటీలోని కీలక పదవులను ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లకు రొటేషన్ ప్రకారం కేటాయించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ బాధ్యులు వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానించారు.

నైపుణ్యాలపై పట్టుసాధించాలి..

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో పోటీ తట్టుకోవాలంటే హైటెక్ స్కిల్స్‌పై పట్టుసాధించాలని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు.గురువారం కేయూలోని జీయాలజీ విభాగం అధిపతి మల్లికార్జున్‌రెడ్డి సారథ్యంలో ఆ విభాగంలో ఏర్పాటుచేసిన జియో ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ల్యాబ్, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక అతిథులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని బోర్న్‌టెక్ సొల్యూషన్స్ సంస్థ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ యుగంధర్ గూడూరు, శ్రీకాంత్ పారెపెల్లి, కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, యూనివర్సిటీ కాలేజి ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్,సైన్స్ కోర్సుల డీన్ జి. హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం బాధ్యులు, తదితరులు

బీసీ సమాజంపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు


- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణనకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు చేస్తోందని, బీసీ సమాజంపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని, కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీలు ఖబడ్దార్ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శ్రీనివాస్ గౌడ్ చేపట్టిన కుల గణన చైతన్య యాత్రలో భాగంగా గురువారం కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో ఉమ్మడి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులు ఉండవన్నారు. సంక్షేమ పథకాలకు సమగ్ర కులగణనకు ఎలాంటి సంబంధం లేదని, ప్రజలు భయాందోళనలు వీడాలన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకే రాష్ట్రంలో సమగ్ర కులగణన జరుగుతోందని, దీనివల్ల ఎవరికి నష్టం వాటిల్లదన్నారు. జాతీయ అధికార ప్రతినిధి తీగల ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అన్ని కుల సంఘాలపై ఉందన్నారు. కులగణనను బీసీలు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలను మోసం చేసినట్లేనన్నారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల లోపు కులగణన పూర్తి చేయాలని, కులగణనను అడ్డుకోవాలని చూస్తే దేనికైనా తెగిస్తామని హెచ్చరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కులగణన పై ప్రజల్లో ఇంకా అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్యయాదవ్, బచ్చు ఆనందం, గౌడ రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, బీసీ సంఘం నాయకులు ఏడునూరి రాజమౌళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్ర రాజు, బీసీ విద్యార్థి నాయకులు అరెగంటి నాగరాజు, డాక్టర్ కూరపాటి రమేశ్, అడ్వకేట్ సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతి కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, జనగాం శ్రీనివాస్, కాసగాని అశోక్, మడిశెట్టి నాగరాజు పటేల్, తుపాకుల రవి, బీసీ సంఘం మహిళా నాయకులు మాధం పద్మజాదేవి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

కొజ్జోడు అన్నాడని.. నరికి చంపాడు

- భార్య, కుమారుడి కళ్లెదుటే ఘాతుకం
- డబ్బు లావాదేవీల విషయంలో గొడవ
- ఎల్లారెడ్డిగూడెంలో ఘటన


పరశురాములు (ఫైల్)


నిందితుడు మహేందర్

రఘునాథపల్లి: అప్పు చెల్లించమన్నందుకు కొజ్జోడు అని అవమానించాడని ఓ తాపీ మేస్త్రీని ఓ వ్యక్తి దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంపల పరశురాములు (40) అదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్ ఇంటి నిర్మాణ పనులు చేశాడు. మృతుడి భార్య సంధ్య.. భర్తతో పాటు పనికి వెళ్లేది. ఈ సమయంలో సంధ్య అనారోగ్యానికి గురైంది. వైద్య పరీక్షలు నిర్వహించగా క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. దీంతో చికిత్స నిమిత్తం పరశురాములు.. మహేందర్ వద్ద రూ. 80 వేలు అప్పు తీసుకున్నాడు. పనుల కింద కొంత అప్పు చెల్లించగా మరి కొన్ని డబ్బులు ఇవ్వాల్సి ఉంది. పలుమార్లు అడిగినా ఇవ్వకపోవడంతో ఇటీవల ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తనను కొజ్జోడు అన్నాడని మహేందర్.. పరశురాములుపై పగ పెంచుకున్నాడు. బుధవారం రాత్రి మహేందర్ పలుమార్లు తన ఇంటికి రావాలని ఫోన్ చేయడంతో 12.45 గంటల సమయంలో పరశురాములు వెళ్లాడు. ఆయన వెనుక భార్య సంధ్య, కుమారుడు అనిరుధ్ వెళ్లారు. అప్పటికే కత్తితో సిద్ధంగా ఉన్న మహేందర్ తన ఇంటి ముందుకు పరశురాములు రాగానే నన్ను కొజ్జోడు అంటావా అంటూ తలపై దారుణంగా నరికాడు. దీంతో పరశురాములు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య చేసిన వెంటనే నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. దీనిపై సమాచారం అందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నరేశ్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మొత్తుకున్నా.. ఒక్కరూ రాలేదు

తన భర్తను నరికేస్తుండగా లబోదిబోమని మొత్తుకున్నా ఏ ఒక్కరూ రాలేదని మృతుడి భార్య సంధ్య జనగామ ఆసుపత్రి వద్ద కన్నీటిపర్యంతమైంది. మొదటి కత్తి వేటు పడినప్పుడు గ్రామస్తులెవరైనా ముందుకు వచ్చి ఉంటే తన భర్త బతికేవాడని వాపోయింది. కాగా, హత్య ఘటన నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హాస్టల్ గదిలో గంజాయి

- రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఐదుగురు విద్యార్థులు

హసన్‌పర్తి: వరంగల్ నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ గదిలోనే గంజాయి తాగుతూ ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. కాలేజీ హాస్టల్ గదిలో విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు నార్కోటిక్ బృందానికి సమాచారం రాగా, హుటాహుటిన వారు కాలేజీకి వెళ్లి తనిఖీ చేశారు. ఐదుగురు విద్యార్థులు గంజాయి తాగుతుండగా పట్టుకున్నారు. అనంతరం గదిలో సోదాలు చేయగా గంజాయి ప్యాకెట్లు గుర్తించినట్లు తెలిసింది. పట్టుబడిన వారిలో ఇద్దరు బీటెక్ ద్వితీయ సంవత్సరం, ముగ్గురు తృతీయ సంవత్సరం విద్యార్థులున్నట్లు తెలిసింది. దీనిపై హసన్‌పర్తి పోలీసులను వివరణ కోరగా తమకు నార్కోటిక్ బృందంనుంచి ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

చేతి యంత్రాలతో విత్తనాలు విత్తుకోవచ్చు

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న


యంత్రం పనితీరును పరిశీలిస్తున్న రాజన్న

ఖిలా వరంగల్: చేతి యంత్రాలతో విత్తనాలను విత్తుకోవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న తెలిపారు. ఈమేరకు వరంగల్ మామునూరు పీవీనరసింహారావు పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో కృషి విజ్ఞానం కేంద్రం శాస్త్రవేత్తల నేతృత్వంలో గురువారం యాసంగి పంటలను పరిశీలించారు. అనంతరం దత్తగ్రామాలు ఎర్రబెల్లి, ఒంటిమామిడిపల్లి రైతులకు అటరీ డైరెక్టర్ షేక్ ఎస్.మీరాతో కలిసి రాజన్న చేతుల మీదుగా చేతితో విత్తనం విత్తే యంత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రాజన్న మాట్లాడారు. ఈ యంత్రంతో 80 రకాల విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. ప్రధానంగా మొక్కజొన్న, వేరుశనగ, పెసరు, ఆముదం, కంది వంటి విత్తనాలను విత్తుకోచ్చన్నారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్తలు రాజు, సౌమ్య, రైతులు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా సదానందం


సదానందం

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం నిజాంపల్లి ఎంపీపీఎస్ ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం అనగోని సదానందం నియమితులయ్యారు.ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేయగా బాధ్యతలు స్వీకరించినట్లు సదానందం గురువారం తెలిపారు. సదానందం 1989 డీఎస్సీలో ఎస్‌జీటీగా నియామకం కాగా కరీంనగర్‌జిల్లా సైదాపూర్ మండలంలో సుమారు 15 సంవత్సరాలు ఎంఆర్‌పీగా విధులు నిర్వర్తించారు.2013లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదోన్నతి పొందారు. రుద్రారం బాలునాయక్ తండాలోని పాఠశాలలో విధులు నిర్వర్తించారు. 317జీఓతో రేగొండ మండలం నిజాంపల్లి ఎంపీపీఎస్ ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మురాలశంకర్‌రావు స్థానంలో తనను నియమించారని సదానందం తెలిపారు.